

భూములిచ్చి కూలీలుగా మారాలా?
మూడు పంటలు పండే భూములను సింగరేణికి ఇచ్చి, తాము కూలీలుగా మారాలా అని మణుగూరు మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం సా॥) 6.24
సహర్ (శనివారం ఉ॥) 5.01

వాతావరణం
గరిష్టం / కనిష్టం 40° / 22°
జిల్లాలో శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం మొదలయ్యే ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారికి నివేదన, హారతి, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

బాలాజీ ఆలయంలో ధ్వజారోహణం



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ అలివేలు మంగతాయారు సమేత బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన గురువారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగ నివేదన, తీర్థప్రసాద గోష్టి, చతుః స్థానార్చన, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌చార్జ్ మేనేజర్ పాకాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్(పా)గా అదనపు బాధ్యతలు



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్)గా విధులు నిర్వర్తిస్తున్న కొప్పుల వెంకటేశ్వర్లుకు డైరెక్టర్(పా)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ యాజమాన్యం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, నాయకులు వంగా వెంకట్, రమణమూర్తి తదితరులు ఘనంగా సత్కరించారు.

నీళ్లు రాక ఎండుతున్న పొలాలు



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: యాసంగిలో సాగుచేసిన వరి పొలాలకు నీళ్లు లేక తడారిపోతున్నాయని బాధిత రైతులు చెబుతున్నారు. మండలంలోని రెడ్డిగూడెంలోని రాళ్లవాగు ప్రాజెక్టు నీటిని నమ్ముకుని యాసంగిలో వరి సాగుచేశారు. రాళ్లవాగులో నీరు అడుగంటి తూము నుంచి రావడం లేదు. దీంతో ప్రాజెక్టు కింద సాగుచేసిన కనీసం బోర్లు, వ్యవసాయ బావులు లేని వరి పొలాలు సుమారు 50 ఎకరాలు బీటలువారి ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, ఏఓ శంకర్, ఇరిగేషన్ ఏఈ రాథోడ్ గురువారం రాళ్లవాగు ప్రాజెక్టులోని నీరు, సాగునీరు అందక ఎండిపోతున్న వరి పొలాలను పరిశీలించారు.

16న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 16న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. అండర్ –14, 16, 18, 20, పురుషులు మహిళల విభాగాల్లో 100, 400, జావెలిన్‌త్రో అంశాల్లో పోటీలు ఉంటాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

పింక్‌లో ఏముందో..!?



నిధులు కేటాయించారా..?

మణుగూరు – రామగుండం రైల్వేలైన్‌ను 1999లో ప్రతిపాదించారు. అనేక సార్లు సర్వేలు జరిగిన తర్వాత గత సెప్టెంబర్‌లో గెజిట్ నోటిఫికేషన్ వచ్చింది. 207 కి.మీ.నిడివి గల ఈ లైన్ నిర్మాణానికి రూ.3,600 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఈ లైన్ నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ సాగుతోంది. ఇక భద్రాచలంరోడ్ – డోర్నకల్ మధ్య ప్రస్తుతం సింగిల్ లైన్ ఉంది. పెరిగిన రద్దీ కారణంగా దీన్ని డబ్లింగ్ చేయాలని నిర్ణయించారు. 54.65 కి.మీ. నిడివి గల ఈ లైన్ నిర్మాణానికి భూసేకరణ పూర్తయింది. నిర్మాణ వ్యయం రూ.770 కోట్లు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. నిధుల కేటాయింపు జరిగితే పనులు ప్రారంభించడమే తరువాయి అన్నట్టుగా ఉంది ఈ లైన్ పరిస్థితి. అయితే 2025 – 26 బడ్జెట్‌లో ఈ రెండు పనులకు నిధులు కేటాయించారా లేదా అనే సందేహం నెలకొంది. మరోవైపు భద్రాచలంరోడ్ – కొవ్వూరు మార్గం నిర్మించేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే ప్రకటనలు ఏపీ నుంచి వినిపిస్తున్నాయి.

కేంద్ర బడ్జెట్ ప్రకటించి నెలరోజులు దాటినా రైల్వే పరంగా కీలకమైన పింక్‌బుక్ వివరాలు ఇప్పటికీ వెల్లడి కాలేదు. దీంతో జిల్లాకు సంబంధించి ఏ ప్రాజెక్టుకు ఎన్ని నిధులు వచ్చాయి.. ఇప్పటికే మంజూరైన పనుల్లో పురోగతి ఎలా ఉంటుంది..అనే అంశాలపై స్పష్టత రావడం లేదు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- గతంలో జిల్లాకు పలు రైల్వే లైన్లు మంజూరు
- నిధుల కేటాయింపు వివరాలు పింక్‌బుక్‌లో నమోదు
- కేంద్ర బడ్జెట్ ప్రకటించి నెల రోజులైనా వెల్లడించని సర్కారు

కొత్త ప్రాజెక్టులకు నిధుల విడుదలపై స్పష్టత కరువు

సర్వేలతోనే సరి ..

భద్రాద్రి జిల్లా తెలంగాణ రాష్ట్ర సరిహద్దుగా ఉంది. రైల్వే పరంగా ఇతర రాష్ట్రాలను కలుపుతూ గతంలో భద్రాచలంరోడ్ – కొవ్వూరు, కొత్తగూడెం – కొండపల్లి, మణుగూరు – రామగుండం, మణుగూరు – కిరండోల్ మార్గాల నిర్మాణానికి పలుమార్లు సర్వే చేశారు. దీంతో పాటు డోర్నకల్ జంక్షన్ – భద్రాచలంరోడ్ డబ్లింగ్ పనులకూ సర్వే జరిగింది. ఇబ్బడి ముబ్బడిగా లైన్లకు సర్వే చేసినా నిధులు మాత్రం మంజూరు కాలేదు. కానీ గతేడాది అనూహ్యంగా మల్కన్‌గిరి – భద్రాచలం – పాండురంగాపురం వరకు కొత్త లైన్‌ను కేంద్రం మంజూరు చేసింది. దీంతో పాటు ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తయిన భద్రాచలంరోడ్ – డోర్నకల్ జంక్షన్ డబ్లింగ్, మణుగూరు – రామగుండం లైన్లనూ నిర్మిస్తామని ప్రకటించింది.

స్వయంగా ప్రకటించిన కేంద్రం..

భద్రాచలంరోడ్ – మణుగూరు రైల్వే లైన్‌లో ఉన్న పాండురంగాపురం స్టేషన్ నుంచి భద్రాచలం మీదుగా ఒడిశాలోని మల్కన్‌గిరి – జైపూర్ – గుణుపూర్ మీదుగా పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ వరకు కొత్తగా రైలు మార్గం నిర్మిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గిరిజన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా గతేడాది ఈ ప్రాజెక్ట్‌ను మంజూరు చేశామని, త్వరితగతిన పనులు ప్రారంభిస్తామని పేర్కొంది. దాదాపు 270 కి.మీ. నిడివి కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.7,383 కోట్ల వ్యయం అవుతుంది. కొండలు, అడవుల గుండా ఈ మార్గం నిర్మించాలి. పర్యావరణ అనుమతులు సాధిస్తూ భారీ వంతెనలతో కూడిన ఈ ప్రాజెక్టు పూర్తిగా అందుబాటులోకి వచ్చేందుకు దశాబ్దానికి పైగా సమయం పట్టినా ఆశ్చర్యం లేదు.

పని చిన్నదే.. ఫలితం పెద్దది

మల్కన్‌గిరి – భద్రాచలం రైల్వేలైన్‌లో తెలంగాణ పరిధిలోకి వచ్చే పాండురంగాపురం నుంచి సారపాక వరకు 12 కి.మీ. మేరకు నిర్మించాల్సిన లైన్‌కు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. కేవలం 12 కి.మీ. లైన్ నిర్మించడం ద్వారా పుణ్యక్షేత్రమైన భద్రాచలం పట్టణానికి తక్షణమే రైలు కనెక్టివిటీ ఏర్పడుతుందని ఆయన కోరారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ లైన్ నిర్మాణానికి నిధులేమైనా మంజూరయ్యాయా లేదా అనేది తేలడం లేదు. కనీసం మంత్రి తుమ్మల విజ్ఞప్తికి సానుకూల స్పందన వచ్చినా రామయ్య భక్తులకు తీపి కబురు అందినట్టే. ఇక గతంలో జిల్లా నుంచి నడిచిన పాత రైళ్ల పునరుద్ధరణ, షిర్డీ, తిరుపతి, బెల్లంపల్లితో పాటు సత్తుపల్లి మార్గంలో కొత్త ప్యాసింజర్ రైళ్ల ప్రకటన వంటివి ఇప్పటికీ ఎండమావిగానే మిగులుతున్నాయి.

రామయ్య పెళ్లి పనులకు నేడు శ్రీకారం

- మిథిలా స్టేడియం వద్ద తలంబ్రాల తయారీకి ఏర్పాట్లు
- తీర్థబిందెతో వసంతోత్సవానికి అంకురార్పణ
- నేడు స్వామివారి నిత్యకల్యాణం రద్దు



వసంతోత్సవంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారు (ఫైల్)

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టనున్నారు. పెళ్లి పనులకు ఆదిమూలంగా భావించే పసుపు కొమ్ములను దంచి తలంబ్రాలు కలిపే వేడుకకు వైకుంఠ ద్వారం, మిథిలా స్టేడియం ప్రాంగణం సిద్ధమయ్యాయి. ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో ఈ వేడుకను అంగరంగవైభవోపేతంగా జరపడం ఆనవాయితీ. గత రెండేళ్లుగా భక్తులు సైతం పాల్గొనేలా మిథిలా స్టేడియం ప్రాంగణంలో ఈ వేడుకను ఆలయ ఈఓ రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

తలంబ్రాల తయారీతో మొదలు..

వసంతోత్సవం రోజున భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలు కలిపే వేడుకను ప్రారంభించడం సంప్రదాయం. భక్తులు అత్యంత ఆధ్యాత్మికంగా భావించే ఈ కార్యక్రమాన్ని రెండేళ్లుగా మిథిలా స్టేడియం ప్రాంగణం, వైకుంఠద్వారం వద్ద నిర్వహిస్తున్నారు. పెళ్లి పనుల్లో భక్తులందరినీ భాగస్వాములు చేసేందుకు ఈ వేడుకకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది 200 క్వింటాళ్ల తలంబ్రాలు కలిపేలా అధికారులు సన్నాహాలు చేస్తుండగా తొలి రోజు పసుపు, కుంకుమ దంచి, ప్రత్యేక గులాముల తో 20 క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేయనున్నారు. వసంతోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిత్యకల్యాణం రద్దు చేశామని, శనివారం నుంచి యథావిధిగా కొనసాగుతుందని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

తీర్థ బిందెతో శ్రీకారం..

ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా భద్రాద్రి రామాలయంలో శుక్రవారం జరగనున్న డోలోత్సవం, వసంతోత్సవానికి గురువారం అంకురార్పణ చేశారు. మేళతాళాలు, అర్చకుల వేద మంత్రాల నడుమ పవిత్ర గోదావరి నదీ జలాలను తీసుకొచ్చి అంకురార్పణ చేశాక యాగశాలలో వాస్తుహోమం నిర్వహించారు.

నేడు వసంతోత్సవం, డోలోత్సవం..

బేడా మండపంలో శుక్రవారం వసంతోత్సవం, డోలోత్సవం జరపనున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి సహస్రధారలతో స్నపనం, అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారిని ఊయలలో ఆశీనులు చేసి డోలోత్సవం నిర్వహించనున్నారు. శ్రీ స్వర్ణ లక్ష్మీ అమ్మవారికి పంచామృత స్నపనం, సాయంత్రం 4 గంటలకు సామూహిక కుంకుమార్చన గావిస్తారు.

ముత్యాల తలంబ్రాలు ఎంతో ప్రత్యేకం..

భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం ఎంత ప్రత్యేకమో.. జానకిరాముల నుదిటి పైనుంచి జాలు వారే ముత్యాల తలంబ్రాలకూ అంతే ప్రత్యేకత ఉంటుంది. స్వామి, అమ్మవార్ల నుదుటి పైనుంచి జాలువారే తలంబ్రాలను తమపై చల్లుకుంటే ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, భోగభాగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఆది దంపతులు, అన్యోన్యానికి ప్రతీకలైన సీతారాముల కల్యాణంలో ఉపయోగించే ఈ తలంబ్రాలను తమ ఇంట ఉంచుకోవడానికి భక్తులు తహతహలాడుతుంటారు. ఇక ఇళ్లలో జరిగే వివాహ వేడుక సందర్భంగా తయారుచేసే తలంబ్రాలలో ఈ ముత్యాలు కలిపిన స్వామి వారి తలంబ్రాలు కలిపితే దంపతుల నడుమ మరింత అనురాగం పెంపొందుతుందని, అన్యోన్య దాంపత్యానికి ప్రతీకగా ఉన్న శ్రీ సీతారాముల ఆశీస్సులు లభిస్తాయని పలువురు నమ్ముతుంటారు. అందుకే ఏటా భద్రాచలంలో దొరికే ముత్యాల తలంబ్రాలకు ఆదరణ పెరుగుతోంది. ఇక ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వారు భక్తిశ్రద్ధలతో గోటితో ఒడ్లను ఒలిచి తలంబ్రాలు తయారుచేసి రామయ్య కల్యాణానికి సమర్పించి స్వామి వారి కృపకు పాత్రులవుతున్నారు.

కమనీయంగా రామయ్య కల్యాణం

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

‘సీతారామ’తో 8లక్షల ఎకరాలకు సాగునీరు

- ఈ నెలాఖరుకల్లా రైతులందరికీ భరోసా జమ
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



టన్నెల్‌లో ట్రాక్టర్ నడుపుతూ వెళ్తున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ పాటిల్, తదితరులు

సత్తుపల్లిటౌన్: రానున్న నాలుగేళ్లలో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయడమే తన లక్ష్యమని, తద్వారా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏడు నుంచి ఎనిమిది లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందుతాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సీతారామ ప్రాజెక్టులో భాగమైన సత్తుపల్లి మండలం యాతాలకుంటలోని ట్రంక్ టన్నెల్ పనులను గురువారం ఆయన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి.పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఈక్రమంలో టన్నెల్‌లోకి మంత్రి తుమ్మల స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ వెళ్లి పనులను పరిశీలించాక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి ట్రంక్ పూర్తయితే ఉగాదికల్లా బేతుపల్లి చెరువు, లంకాసాగర్ ప్రాజెక్టులోకి గోదావరి జలాలు చేరతాయని, తద్వారా సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లో రెండు లక్షల ఎకరాలకు నీరు అందుతుందని చెప్పారు. జిల్లా యంత్రాంగానికి ప్రజల సహకారం.. ఆపై శ్రీరామచంద్రుడి దయతో పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. భద్రాద్రి జిల్లాలో జూలూరుపాడు టన్నెల్ భూసేకరణ, అటవీ అనుమతుల కోసం కలెక్టర్ చొరవ చూపితే పాలేరుకు సైతం గోదావరి జలాలు చేరతాయన్నారు. ఇద్దరు కలెక్టర్లు కష్టపడుతూనే మనస్సు పెట్టి పనిచేస్తున్నారని మంత్రి కితాబిచ్చారు.

త్వరలోనే భరోసా, బోనస్

రైతులందరికీ రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు రూ.6వేల చొప్పున రూ.10వేల కోట్లు ఈనెలాఖరు నాటికి జమ చేస్తామని మంత్రి తుమ్మల వెల్లడించారు. ఖజానాలో నిల్వలు లేనప్పటికీ అప్పోసప్పో చేసైనా నిధులు విడుదల చేస్తామన్నారు. అలాగే, సన్నధాన్యం అమ్మిన రైతులకు రూ.1,100 కోట్ల బోనస్‌కు గాను ఇప్పటి వరకు రూ.900 కోట్లు చెల్లించామని, మిగతావి సైతం త్వరలో అందిస్తామన్నారు. ఇక ఖమ్మం-రాజమండ్రి గ్రీన్‌ఫీల్డ్ హైవే ఆగస్టు 15 కల్లా ఈ రహదారి అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. బుగ్గపాడు ఫుడ్‌పార్కులో మరో రెండు పరిశ్రమలు ఏర్పాటు కానుండగా, ఉగాది నాటికి కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు.

సంప్రదాయ పంటలు వద్దు..

నీళ్ల విలువ రైతులకే ఎక్కువగా తెలుస్తుందని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఈమేరకు సంప్రదాయ పంటలు కాకుండా ఆయిల్‌పామ్ వంటివి సాగు చేస్తే రైతులు రాజుల్లా బతకవచ్చన్నారు. ఉపాధిహామీ పథకంతో ఉచితంగా నీటి గుంతలు తవ్విస్తున్నందున రైతులు ముందుకు రావాలని సూచించారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ రైతులు అవగాహనతో లాభదాయక వ్యవసాయం చేస్తే వారి కుటుంబాలు ఆర్థికంగా బాగు పడతాయని తెలిపారు. ఖమ్మం జెడ్పీ సీఈఓ దీక్షారైనా, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎస్‌ఈలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసాచారి, మార్కెట్ చైర్మన్లు దోమ ఆనంద్‌బాబు, భాగం నీరజాచౌదరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్.రాజేశ్వరి, ఎఫ్‌డీఓ మంజులతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, డాక్టర్ మట్టా దయానంద్, సాధు రమేష్‌రెడ్డి, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, చల్లగుళ్ల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు ఖరారు

రూ.97.62 లక్షలతో నవమి పనులు ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవ ఏర్పాట్లకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ఆలయ అధికారులు పూర్తి చేశారు. ఈ మేరకు ఈఓ రమాదేవి టెండర్ల వివరాలను గురువారం వెల్లడించారు. మొత్తం రూ.1.41 కోట్లతో కల్యాణ ఏర్పాట్ల టెండర్లను ఆహ్వానించగా రూ.97.62 లక్షలకు ఖరారయ్యాయి. ఇందులో కల్యాణ మండపం, స్వాగత ద్వారాలకు రంగులు వేయడానికి రూ.6.50 లక్షలు, ఆలయ పరిసరాల్లో వెదురు చాపలతో చలువ పందిళ్లు, క్లాత్ డెకరేషన్‌కు రూ.5.27 లక్షలు, విస్తా కాంప్లెక్స్ స్టేడియంలో తాత్కాలిక పనులకు రూ.6.60 లక్షలు, స్నాన ఘట్టాల వద్ద వాటర్ లైన్, దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణం, లడ్డూ, తలంబ్రాల పంపిణీ కౌంటర్ల ఏర్పాటు, గ్రీన్ మ్యాట్ ఏర్పాటుకు రూ.7.17 లక్షలు, పర్ణశాల దేవాలయానికి రంగులు వేసేందుకు రూ. 6.40 లక్షలు, ఆలయ పరిసరాల్లో భక్తుల తాగునీటి సౌకర్యానికి రూ.6.68 లక్షలు, భక్తులు సేద తీరేందుకు వసతి, సైడ్‌వాల్స్, కార్పెట్ల ఏర్పాటుకు రూ.7.29 లక్షలు, గోదావరి ఘాట్, పర్ణశాల, కల్యాణ మండపం పరిసరాల్లో తాత్కాలికంగా విద్యుత్ లైట్లు, అలంకరణకు రూ.7.59 లక్షలు, కల్యాణ సెక్టార్లలో ఏసీలు, డెజర్ట్ కూలర్ల ఏర్పాటుకు రూ.7.44 లక్షలతో టెండర్లు ఖరారు చేసినట్లు వివరించారు. కాగా, టెండర్లు దక్కించుకున్న వారు పనులు త్వరగా ప్రారంభించేలా ఆలయ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

‘ప్రకృతి’ సభలకు రండి

కలెక్టర్‌కు ప్రకృతి ప్రేమికుల ఆహ్వానం



కలెక్టర్‌కు మొక్క అందించి ఆహ్వానిస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమంలో ఈనెల 23న నిర్వహించనున్న ప్రకృతి ఆరోగ్య మహాసభలకు హాజరు కావాలని కోరుతూ కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు గురువారం ప్రకృతి ప్రేమికులు ఆహ్వానించారు. జిల్లాలో ప్రకృతి పర్యావరణంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న పాటిల్‌ను ఈ మహాసభలకు హాజరై సందేశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆశ్రమ సభ్యులను అభినందించిన కలెక్టర్.. సభలకు హాజరవుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ గ్రీన్ అంబాసిడర్ మొక్కల వెంకటయ్య, సభల కో ఆర్డినేటర్ జి.సుగుణారావు, మొక్కల రాజశేఖర్, బంగారి శంకర్, దయానందసాగర్, రాజేష్ పాల్గొన్నారు.

ఐటీఐకి అనువైన స్థలం గుర్తించాం..

గ్రామీణ నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుపై రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్.. అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి హాజరై జిల్లా వివరాలు వెల్లడించారు. అశ్వారావుపేటలో ఐటీఐ స్థాపనకు అనువైన స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఆ స్థలం రహదారికి సమీపంలో ఉందని, ఆర్టీసీ రవాణా సౌకర్యం కూడా ఉందని చెప్పారు. సమీపంలో పరిశ్రమలు కూడా ఉన్నాయన్నారు. అశ్వారావుపేట రాష్ట్రంలోనే ఆయిల్‌పామ్‌కు హబ్‌గా ఉందని, ఇక్కడ వ్యవసాయ కళాశాల కూడా ఉన్నందున ఐటీఐలో వ్యవసాయ సంబంధిత కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. దీంతో ఎలాంటి కోర్సులు ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు ఎక్కువ లాభం చేకూరుతుందో తగిన నివేదికలను అందజేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ కలెక్టర్‌కు సూచించారు.

నవమి నాటికి మ్యూజియం ప్రారంభిస్తాం

- సుందరీకరణ పనులు సాగుతున్నాయి..
- పెయింటింగ్‌లు చివరి దశకు చేరాయి
- ఐటీడీఏ పీఓ రాహుల్ వెల్లడి



అధికారులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్ : భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో నిర్మిస్తున్న ట్రైబల్ మ్యూజియం పనులు చివరి దశకు చేరాయని, ఈనెల 22 వరకు పూర్తి చేస్తామని, శ్రీరామనవమి నాటికి మ్యూజియాన్ని ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నామని పీఓ బి.రాహుల్ తెలిపారు. మ్యూజియం పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యాటకులకు ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు గుర్తుండిపోయేలా రూపొందిస్తున్నామని, మ్యూజియాన్ని చూడగానే కొత్త అనుభూతి వచ్చేలా సుందరీకరణ పనులు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం పాతకాలపు ఇల్లు నిర్మాణంతో పాటు కోయ సంస్కృతికి సంబంధించిన పెయింటింగ్‌లు పూర్తి కావొస్తున్నాయని అన్నారు. పండుగలకు సంబంధించిన బొమ్మల చిత్రీకరణ కొనసాగుతోందని, బాక్స్ క్రికెట్ గ్రౌండ్, బోటింగ్ చెరువుతో పాటు ఆర్చరీ గ్రౌండ్ పనులు పూర్తి కావచ్చాయని వెల్లడించారు. మ్యూజియం సందర్శనకు వచ్చే వారికి గిరిజన వంటకాలతో పాటు చైనీస్ ఫుడ్ అందుబాటులో ఉంచుతున్నామని, ఈ మేరకు స్టాళ్లు సిద్ధం చేశామని చెప్పారు. సందర్శకులు కొనుగోలు చేసేందుకు కోయ కల్చర్ బొమ్మలు అందుబాటులో ఉంచుతామని, పాత తరానికి చెందిన కళాఖండాలు సిద్ధం చేశామని వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ ఆయా శాఖల అధికారులు చంద్రశేఖర్, ఉదయ్‌కుమార్, హరీష్, గోపాలరావు, నర్సింగరావు, వేణు, ప్రభాకర్ రావు, శ్రీనివాసరావు, చిట్టిబాబు, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

‘అబ్దుల్ కలాం’లో కల్చరల్ సింపోజియం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నేషనల్ లెవెల్ టెక్నికల్ కల్చరల్ సింపోజియం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దయాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో గురువారం ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. టెకీ సింపోజియం ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయవచ్చని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఓటరు జాబితా సవరణ పూర్తిచేయాలి


వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మార్చి 19 లోపు ఓటరు జాబితా సవరణ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దారాప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలు తనిఖీ


సీసీ రోడ్లను తనిఖీ చేస్తున్న డీఈ శశికళ

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలను గురువారం క్వాలిటీ కంట్రోల్ డీఈ శశికళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్లను నిర్దేశిత సమయానికల్లా పూర్తి చేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుజాతనగర్: 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలల గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో (ఇంగ్లిష్ మీడియం) మిగిలిపోయిన ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వి.బ్యూలారాణి గురువారం ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, ఈబీసీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ నెల 31 వరకు తుది గడువు అని, ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

'దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్నాం..'


వాహనాలు ఆపి సింగరేణి అధికారులతో మాట్లాడుతున్న స్థానికులు

టేకులపల్లి: సింగరేణి నిధులతో రేగులతండా నుంచి దాసుతండా వరకు ఏడాది కిందట చేపట్టిన రోడ్డు నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో దుమ్ము, ధూళితో ఆస్పత్రి పాలవుతున్నామని, ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొందని రేగులతండాలో సంత్ శ్రీ సేవాలాల్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఇస్లావత్ నామానాయక్ ఆధ్వర్యంలో సింగరేణి వాహనాలను నిలిపి నిరసన తెలిపారు. దీంతో కార్మికులను విధులకు తరలించే బస్సు, బొగ్గు లారీలు, టిప్పర్లు నిలిచిపోయాయి. కనీసం నీటి పిచికారీ కూడా సరిగ్గా చేయడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య, టేకులపల్లి సీఐ సురేశ్.. నామానాయక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెల 25 లోపు రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దీక్షలు విరమించండి.. సీఎండీకి నివేదిస్తా

సత్తుపల్లి: సైలో బంకర్‌తో స్థానికులకు ఎదురవుతున్న సమస్యలు తమ దృష్టిలో ఉన్నందున దీక్షలు విరమిస్తే ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కిష్టారం అంబేద్కర్‌నగర్‌లో సైలో బంకర్‌కు వ్యతిరేకంగా 30రోజులుగా జరుగుతున్న నిరాహార దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. స్థానికులు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులను సింగరేణి సీఎండీ బలరాంనాయక్ దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం లభించేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ సైలోబంకర్ సమస్యను ఎమ్మెల్యే రాగమయి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటంతో పాటు అసెంబ్లీలో ప్రస్తావించారని తెలిపారు. ప్రజల ఆవేదనపై ప్రభుత్వంతోనైనా గట్టిగా చర్చించనున్నందున తమపై నమ్మకంతో దీక్షలు విరమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జీఎం షాలేం రాజు, పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సైతం సైలో బంకర్ బాధితులు కలిశారు. సమస్యపై సింగరేణి సీఎండీతో కలిసి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులం మాట్లాడతామని, అయినా ఫలితం లేకపోతే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ఈమేరకు దీక్షలను విరమించాలని ఆయన సూచించగా, చర్చించుకుని శనివారం చెబుతామని అటు సింగరేణి డైరెక్టర్, ఇటు మంత్రికి అంబేద్కర్‌నగర్ కాలనీవాసులు బదులిచ్చారు.

పూర్వ వీఆర్‌ఓల్లో ఆశలు

- ఉగాది నాటికి 'భూభారతి'
- తద్వారా సొంత శాఖలోకి తీసుకుంటారని ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో 562మంది ఎదురుచూపులు


సమస్యల పరిష్కారానికి చేపట్టిన ఆందోళనల్లో వీఆర్‌ఓలు (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. దీంతో మళ్లీ తాము సొంత శాఖ అయిన రెవెన్యూలోకి వెళ్తామని పూర్వ వీఆర్వోల్లో ఆశలు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వం నవంబర్ 19, 2020న వీఆర్వో వ్యవస్థను రద్దు చేసి 2022 జూలై 23న వీఆర్వోలను ఇతర శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో సర్దుబాటు చేసింది. ఆ సమయాన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీ లేక.. జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కలిగిన వీఆర్వోలను అటెండర్, స్వీపర్, కామాటి, కుక్, తోటమాలి, జీపు డ్రైవర్, రికార్డు కీపర్, రికార్డ్ అసిస్టెంట్, వార్డు అధికారి, సీనియర్ స్టెనో, జూనియర్ స్టెనో తదితర పోస్టుల్లో సర్దుబాటు చేశారు. అయితే, సరైన స్థాయి పోస్టులు లేక, ఆశించిన గౌరవం కూడా లభించటం లేదని వారు ఆవేదన చెందుతున్నారు.

మళ్లీ ఇన్నాళ్లకు...

కొత్త ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకొస్తామని చెబుతుండగా, పూర్వ వీఆర్వోలు ఆశలు రేకెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11వేల పోస్టులు భర్తీ చేస్తామని చెబుతున్న క్రమంలో పూర్వ వీఆర్వోలు 5వేల మందిని ఈ పోస్టుల్లోకి తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఫలితంగా పూర్వ వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకోనుండగా, ఇంకొందరు నిరుద్యోగులకూ ఉద్యోగావకాశాలు దక్కే అవకాశముంది.

ఏం పేరు?

రాష్ట్రప్రభుత్వం భూభారతిలో విధులు నిర్వర్తించే వారికి గ్రామ పరిపాలన అధికారి(జీపీఏ) లేదా విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(వీఏఓ)గా పేరు పెట్టే అవకాశముందని రెవెన్యూ వర్గాల ద్వారా తెలిసింది. ఉగాది నాటికి స్పష్టత వచ్చే అవకాశముంది.

ఉమ్మడి జిల్లాలో గ్రామాలు, వీఆర్వోల వివరాలు

జిల్లా	మండలాలు	రెవెన్యూ గ్రామాలు	వీఆర్వోలు
ఖమ్మం	21	352	329
భద్రాద్రి	23	240	233
మొత్తం	44	592	562

అయితే, గ్రామస్థాయిలో వీఆర్వోలు కీలకం కానున్నందున జీపీఏనే పేరు ఖరారు చేసే అవకాశముందని చెబుతున్నారు.

ఈ సమస్యలూ పరిష్కరిస్తే...

తమను ఇతర శాఖల్లో సర్దుబాటు చేయడంతో సర్వీస్ రక్షణతో పాటు పదోన్నతులు కోల్పోయామని వీఆర్వోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇంక్రిమెంట్లు కోల్పోయామని, నేటికీ సర్వీస్ క్రమబద్ధీకరణ జరగలేదని, ప్రొబేషనరీ పీరియడ్ ఖరారు చేయడం లేదనే వాదన ఉంది. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జీసీసీలో సేల్స్‌మెన్లుగా, పెట్రోల్ బంక్ ఆపరేటర్లుగా కేటాయించిన 16మందికి వేతనాలు అందడం లేదని చెబుతున్నారు. అంతేకాక ఇద్దరు వీఆర్వోలు మృతి చెందడంతో కారుణ్య నియామకాల్లోనూ అవకాశం ఇవ్వలేదని ఆవేదన చెందుతున్నారు. కాగా, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో ఇటీవల రెవెన్యూ అసోసియేషన్‌తో కలిసి పూర్వ వీఆర్వోలు సమావేశమయ్యారు. భూభారతిలో అవకాశం కల్పించడమే కాక ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆయనను కోరారు.

సీనియారిటీతో పదోన్నతులు



రాష్ట్ర ప్రభుత్వం భూభారతిని తీసుకొచ్చి అప్పగించే ప్రతీ పనిని బాధ్యతగా చేస్తాం. అయితే, మా సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు కామన్ సీనియారిటీ ద్వారా పదోన్నతులు వర్తింపచేయాలి. ప్రతీ గ్రామానికి ఒక సహాయకుడిని నియమిస్తే క్షేత్రస్థాయిలో సులువుగా పాలన సాగుతుంది.

– గరికె ఉపేంద్రరావు, వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

వేతనాలు అందడం లేదు



వీఆర్వో వ్యవస్థ రద్దయ్యాక నన్ను గిరిజన కార్పొరేషన్ సొసైటీ(జీసీసీ)కి కేటాయించారు. ప్రభుత్వం 60శాతం, కార్పొరేషన్ 40శాతం నిధులతో వేతనం ఇవ్వాలి. కానీ సక్రమంగా వేతనాలు అందక ఇబ్బందిగా ఉంది. ఇతర శాఖల్లో మాదిరి కార్పొరేషన్‌లో పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్లు సౌకర్యాలు అందడం లేదు.

– మట్టా వెంకటమ్మ, జీసీసీ ఉద్యోగి, మణుగూరు

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం


స్వామివారి మూలవిరాట్


విద్యుత్ దీపాల వెలుగులో వేణుగోపాలస్వామి ఆలయం

బూర్గంపాడు: గోదావరి తీరంలో కొలువైన ఇరవెండి సంతాన వేణుగోపాలస్వామి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 14వ తేదీన రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరగనుంది. చోళుల కాలం నాటి పురాతన సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణం రోజున గరుడ ముద్దలు పంపిణీ చేస్తారు. సంతానం లేనివారు ఈ గరుడ ముద్దలు స్వీకరిస్తే సంతానం కలుగుతుందని ఈ ప్రాంత ప్రజలు విశ్వాసం. పూర్వం ఈ ఆలయంలో స్వామి వారిని వెండిపూలతో పూజించేవారని చెబుతుంటారు. అందుకే ఈ గ్రామానికి విరివెండిగా పేరువచ్చిందని, కాలక్రమంలో ఇరవెండిగా మారిందని, ఈ ఆలయం ఎదుట అష్టభుజ సత్తెమ్మ తల్లి విగ్రహం ఉండగా.. ఆలయానికి ఆమె రక్షణగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. హోలీ పండుగ రోజున జరిగే స్వామివారి కల్యాణానికి ఆలయ కమిటీ బాధ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం స్వామివారి మేలుకొలుపు, అభిషేకాలు, ఆర్జిత సేవలు.. కల్యాణం అనంతరం అన్న సమారాధన, సాయంత్రం తిరువీధిసేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కల్యాణాన్ని వీక్షించేందుకు జిల్లాతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య వెల్లడించారు.

'పెదవాగు ప్రాజెక్ట్' పూర్వ వైభవానికి కృషి


మాట్లాడుతున్న జలగం ప్రసాద్‌రావు

అశ్వారావుపేటరూరల్: దశాబ్దాల కాలంగా పంట పొలాలకు సాగునీరు అందించి ఆయకట్టు రైతులకు అన్నం పెట్టిన పెదవాగు ప్రాజెక్ట్‌కు పూర్వ వైభవం వచ్చేందుకు కృషి చేస్తానని మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టు ఆనకట్టకు గతేడాది జూలై 18న కురిసిన భారీ వర్షాలు, వరద కారణంగా గండ్లు పడగా, ఆయన గురువారం పరిశీలించారు. ముందుగా ప్రాజెక్ట్ వద్దగల శ్రీ గంగానమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించారు. కొద్ది రోజుల కిందటే తాను ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులను కలిసి పెదవాగు ప్రాజెక్ట్ పరిస్థితి వివరించానని, కమిషన్ సభ్యులు ఈ నెల 17వ తేదీన ప్రాజెక్టును పరిశీలించేందుకు వస్తున్నారని, ఆయకట్టు రైతులంతా అందుబాటులో ఉండి వారికి సమస్య, ప్రాజెక్టు స్థితిగతులను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నారాయణపురం సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, రైతులు సత్యనారాయణ, వేలేరుపాడు రైతులు అమరవరపు అశోక్, పిట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

భూములు ఇచ్చి కూలీలుగా మారాలా?

- ఓసీ విస్తరణ భూసేకరణ సభలో గ్రామస్తుల ఆగ్రహం


గ్రామసభలో మాట్లాడుతున్న స్థానికుడు

మణుగూరుటౌన్: మూడు పంటలు పండే భూములు ఇచ్చిన రైతులతో సింగరేణి అధికారులు కూలీ పనులు చేయించాలని భావిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా భూసేకరణకు కొత్త కొండాపురం వద్ద గువారం పెసా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత భూసేకరణ ప్రత్యేకాధికారి సుమ మాట్లాడుతూ.. భూమి కోల్పోతున్న గిరిజనులకు ఎకరాకు రూ.22.50 లక్షలు, ఆర్‌అండ్ఆర్ కింద రూ.5.50 లక్షలు అందిస్తామని, గిరిజనేతరులకు చట్టప్రకారం పరిహారం చెల్లించడమే కాక సింగరేణిలో కాంట్రాక్ట్ ఉద్యోగం ఇస్తామని తెలిపారు. అలాగే, చెరువులో సగ భాగం సింగరేణి తీసుకుంటున్నందున రూ.17 కోట్లతో మరో వైపు చెరువును విస్తరిస్తామని పేర్కొన్నారు. సింగరేణి ఏరియా జీఎం దుర్గం రాంచందర్ మాట్లాడుతూ.. మణుగూరు ఓసీ విస్తరణతో మరో 20 ఏళ్ల భవిష్యత్ ఉంటుందని, రెండు దశాబ్దాలు ఉపాధి లభిసుందన్నారు. దీంతో పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. పెద్దచెరువు విస్తీర్ణం గతంలో 90 ఎకరాలు ఉండేదని ఓసీ ఏర్పాటులో కొంత భాగం గతంలోనే పోయినా మత్స్యకారులకు న్యాయం జరగలేదని, ఇప్పుడు మిగిలిన చెరువును తీసుకుంటామనడం సరికాదన్నారు. మత్స్యకారులకు హామీ ఇవ్వకుండా భూసేకరణకు సిద్ధం కావడం ఏమిటని ప్రశ్నించారు. కాగా, నర్సింహ అనే వ్యక్తి తన భూములు మూడు సార్లు సింగరేణి సేకరిస్తే కాంట్రాక్ట్ ఉద్యోగం, పరిహారం కూడా ఇవ్వలేదని వాపోయారు. పద్మగూడెం, కొమ్ముగూడెం గ్రామాలను సింగరేణి తీసుకున్నప్పుడు పర్మనెంట్ ఉద్యోగాలు ఇచ్చి, తమకు మాత్రం ఎందుకు ఇవ్వరని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం భూసేకరణకు ఆమోదం తెలపాలని అధికారులు కోరగా, ఉద్యోగాలు ఇచ్చి, చెరువుపై ఆధారపడిన మత్స్యకారుల పరిస్థితిపై స్పష్టత ఇచ్చేవరకు భూములు ఇవ్వబోమని స్థానికులు తేల్చిచెప్పి వెనుదిరిగారు. గ్రామసభ అధ్యక్షుడు చందా నాగేశ్వరరావుతో పాటు గనిబోయిన కన్నయ్య, సున్నం మంగయ్య, కుర్రం రవి, కారం నర్సింహారావు, కోడి నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు నిధులు కేటాయించాలి

సింగరేణి పునరావాస గ్రామాలైన కొత్త కొండాపురం, కొత్త కొమ్ముగూడెం గ్రామాల్లో శ్మశానవాటికల నిర్వహణకు నిధులు కేటాయించాలని నిర్వాసితులు ఇప్ప ఆధ్వర్యాన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమకు వినతిపత్రం ఇచ్చారు. దీంతో ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి స్థలంలో పిచ్చిమొక్కలు తీయించాలని అధికారులకు సూచించారు.

మెరుగైన పరిహారం ఇవ్వాలి

మణుగూరురూరల్: ఓసీ విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులందరికీ మెరుగైన పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్, సొసైటీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావుతో పాటు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, పి.శ్రీనివాస్, జావీద్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

జానపద కళాకారుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక


నియామకపత్రాలు అందిస్తున్న రాష్ట్ర బాధ్యులు

పాల్వంచ: తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జిల్లా నూతన కమిటీని బుధవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా షేక్ గద్దర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా డప్పు జానకీరామ్, గౌరవ సలహాదారులుగా మోదుగు జోగారావు, కొండల్‌రావు, ఉపాధ్యక్షులుగా శంకర్‌నాయక్, మహిళా ప్రతినిధిగా మణుగూరు జ్యోతి, సహాయ కార్యదర్శిగా మెంతెన కొండల్‌రావు, కోశాధికారిగా షేక్ ఖాసీం, ఉపాధ్యక్షులుగా ఎండీ ముర్తుజ, సంయుక్త కార్యదర్శిగా కాటూరి రాము, వీర జయమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా తాళ్ల మంగ, ప్రచార కార్యదర్శిగా కనకం కొమరయ్యను ఎన్నుకున్నారు. వారితో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వంగ శ్రీనివాస్‌గౌడ్, సుంచు లింగయ్య, పమ్మి రవి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఈశ్వర్ బహదూర్, రమేశ్, పోలూరి రాము, సుద్దుల శ్రీను, ప్రేమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

హోలీ ప్రశాంతంగా జరుపుకోవాలి


కామదహనం చేస్తున్న రెండో వార్డు ప్రజలు

ఇల్లెందు: హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ చంద్రభాను సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా సంప్రదాయ పద్ధతులు పాటించాలని, స్నానాలకు వెళ్లే క్రమంలో చెరువులు, వాగులు, కాల్వల వద్ద జాగ్రత్తలు పాటించాలని కోరారు. కాగా, ఇల్లెందు రెండో వార్డులో గురువారం రాత్రి హోలీ వేడుకలు ప్రారంభించారు. కాముడి ప్రతిమను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కటకం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం స్టేషన్ ముఖద్వారం మోడల్



అత్యాధునికంగా ఖమ్మం స్టేషన్!

వేగంగా ఆధునికీకరణ పనులు

ఖమ్మం రాపర్తినగర్: అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన ఖమ్మం రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు చకచకా కొనసాగుతున్నాయి. ఈ స్టేషన్‌లో ముఖద్వారం, ప్లాట్‌ఫాంల ఆధునికీకరణ, లిఫ్టులు, ఎస్కలేటర్ల ఏర్పాటు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.25.41 కోట్లు కేటాయించగా ఇప్పటికే 45 శాతం మేర పనులు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. కొద్దినెలల్లో పనులు పూర్తికానుండగా స్టేషన్ కొత్తరూపు సంతరించుకునే అవకాశముంది. కాగా, ఒకేసారి రెండు రైళ్లు వచ్చినా సాఫీగా రాకపోలు జరిగేందుకు రెండు మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఆఖరు దశకు చేరాయని, రెండేసి లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫాం పొడిగింపు, దివ్యాంగుల కోసం కొత్త టాయిలెట్ బ్లాక్ నిర్మాణం, వెయిటింగ్ హాల్ నిర్మాణం కూడా పూర్తికావొస్తున్నాయి.


రెండు మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న ఎఫ్ఓబీ

యువకుడి ఆత్మహత్య..


ఆకాష్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అశోక్‌నగర్‌కాలనీకి చెందిన గడ్డం ఆకాష్ (20) గురువారం ఉదయం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆకాష్ రెండు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతూ స్థానికంగా ఉన్న పలు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్నాడు. ఎంతకూ కడుపునొప్పి తగ్గకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా, మృతుడు అంబేడ్కర్ సెంటర్‌లోని ఓ ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లో పనిచేస్తున్నాడు. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

టేకులపల్లి: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను టేకులపల్లి పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్ఐ సురేశ్ కథనం ప్రకారం.. శంభునిగూడెం సమీపంలోని మొర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుక లోడుతో వస్తున్న రెండు ట్రాక్టర్లను బొమ్మనపల్లి వద్ద పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రవాణా చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు

భద్రాచలంఅర్బన్: వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఏఎస్ఆర్‌కాలనీకి చెందిన రాజేశ్ సతీమణి మనీష ఈ నెల 4వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు ఎంత వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె భర్త రాజేశ్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు.

చికిత్స పొందుతున్న హెచ్‌ఎం మృతి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని వెంగళరావునగర్ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయుడు అగ్గి రవి (42) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటకు చెందిన ఆయన ప్రస్తుతం భీమునిగూడెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. సత్తుపల్లి నుంచి రాకపోకలు సాగిస్తుండగా ద్విచక్ర వాహనంపై ఎర్రగుంటకు వెళ్లే క్రమాన జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో రవిని ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన భార్య కవిత దమ్మపేట మండలం మొండివర్రె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, రవి సోదరుడు కూడా గతంలో రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందినట్లు తెలిసింది.